సాక్షి
వరంగల్
గురువారం । 23 । ఫిబ్రవరి । 2023



అందరి కృషితోనే..
అందరి కృషితోనే రాష్ట్రంలో 24 గంటల నిరంతర విద్యుత్‌ను సరఫరా చేయగలుగుతున్నామని ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు అన్నారు. - 8లో▸



సేవలు ప్రశంసనీయం
లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయమని తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
37.0^0/19.0^0

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు మేఘాలు, సూర్యరశ్మితో వాతావరణం చాలా వేడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అనుమతి లేని కోచింగ్ సెంటర్లపై చర్య తీసుకోవాలి



నర్సంపేట రూరల్: అనుమతి లేకుండా నడుపుతున్న కోచింగ్ సెంటర్లపై చర్య తీసుకోవాలని ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ డిమాండ్ చేశారు. నర్సంపేటలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో నవోదయ, గురుకులాలు, సైనిక్ కోచింగ్ సెంటర్లను అనుమతి లేకుండా ఏర్పాటు చేసి.. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.30వేల నుంచి రూ.40వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కనీస సౌకర్యాలు కల్పించకుండా ఇరుకు గదుల్లో కోచింగ్ ఇవ్వడంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారని అన్నారు. అనుమతి లేని సెంటర్లపై జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు శ్రీకాంత్, వినయ్‌కుమార్, రమేశ్, సందీప్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

'ఓపెన్' పరీక్ష ఫీజు గడువు పెంపు

కాశిబుగ్గ సెంటర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫీజు గడువు తత్కాల్ కింద పొడిగించినట్లు డీఈఓ వాసంతి, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ఎం.శంకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 4వ తేదీ వరకు మీ సేవ ద్వారా లేదా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా చెల్లించవచ్చని, టెన్త్ పరీక్ష ఫీజు రూ.500, ఇంటర్ ఫీజు రూ.1000 చొప్పున చెల్లించాలని పేర్కొన్నారు. తత్కాల్ కింద పెంచిన గడువును వినియోగించుకొని మధ్యలో ఆగిన చదువును కొనసాగించుకోవచ్చని తెలిపారు.

3న దివ్యాంగ టీచర్లకు ప్రత్యేక వైద్య శిబిరం

కాశిబుగ్గ సెంటర్: జిల్లాలోని దివ్యాంగ ఉపాధ్యాయుల కొరకు ప్రత్యేక వైద్య శిబిరం మార్చి 3న ఎంజీఎం ఆస్పత్రిలో ఏర్పాటు చేసినట్లు డీఈఓ వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగ (ఆర్థో, న్యూరో, ఈఎన్‌టీ, సైకియాట్రిస్టు) ఉపాధ్యాయులకు సదరం సర్టిఫికెట్ జారీ కొరకు ప్రత్యేక మెడికల్ క్యాంపు ఉన్నందున ఫ్రెష్, రెన్యూవల్ కొరకు మీ సేవ కేంద్రంలో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. స్లాట్ బుక్ చేసుకున్న వారు మాత్రమే సదరం క్యాంపున హాజరు కావాలని, స్లాట్ ఆన్‌లైన్ సైట్ గురువారం నుంచి అందుబాటులో ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

బాల్య వివాహాలు చేయొద్దు..



గీసుకొండ: బాల్య వివాహాలు చేసిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని, ఎవరూ వాటి జోలికెళ్లొద్దని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జె.ఉపేందర్‌రావు అన్నారు. బుధవారం 16వ డివిజన్ ధర్మారం జెడ్పీ పాఠశాలలో న్యాయ సేవలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రావు మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపొద్దని సూచిస్తూ.. వారికి అవగాహన కలిగించి ప్రతిజ్ఞ చేయించారు. మహిళలు, పిల్లలు, ఎస్సీ, ఎస్టీలు, ఆర్థికంగా వెనుకబడిన వారు అన్యాయానికి గురైతే తమ సంస్థ ద్వారా న్యాయసేవలను ఉచితంగా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ ఆర్.రజిని, హెచ్‌ఎం సుజాత, పారా లీగల్ వలంటీర్లు కరుణాకర్, శ్రీనివాస్, వల్లెం శ్రీనివాస్ పాల్గొన్నారు.

'తొలిమెట్టు' రాష్ట్ర పరిశీలకుడి పరిశీలన

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ మొగిలిచర్ల జెడ్పీ, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను తొలిమెట్టు కార్యక్రమ రాష్ట్ర పరిశీలకుడు చక్రవర్తుల శ్రీనివాస్ బుధవారం సందర్శించారు. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల సామర్థ్యాలు, ప్రణాళిక ప్రకారం బోధన తదితర విషయాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి మాలోతు సారయ్య, జిల్లా రిసోర్స్ గ్రూపు సభ్యులు నాగేశ్వర్‌రావు, నాగార్జున తదితరులు ఉన్నారు.

అసైన్డ్ భూమిలో వెంచర్!
27న వేలేరుకు కేటీఆర్ రాక
నేషనల్ కాన్ఫరెన్స్‌లో ప్రసంగానికి ఆహ్వానం - 10లో▸



ధరావత్ ప్రీతి

ఎంజీఎంలో కలకలం

సీనియర్ వేధింపులు భరించలేక పీజీ విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యాయత్నం

- కౌన్సెలింగ్ ఇచ్చిన గంటల వ్యవధిలోనే ప్రాణం తీసుకోవాలనుకుంది..
- ట్రెమడాల్ తీసుకుందని కొందరు.. అనస్థీషియా అని మరికొందరు..
- కార్డియాక్ అరెస్ట్‌తోపాటు అనారోగ్య సమస్యలు ఉన్నాయంటున్న ఎంజీఎం సూపరింటెండెంట్
- ఘటనపై ఆరా తీసిన మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు

సాక్షి వరంగల్/ఎంజీఎం: ఆస్పత్రిలో డ్యూటీ సమయంలో సీనియర్ వేధింపులు భరించలేక.. గట్టిగా మాట్లాడితే ఎక్కడ మార్కులు తగ్గిస్తారోనని భయపడింది. ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినా వేధింపులు తగ్గలేదు. ఇద్దరికి కౌన్సెలింగ్ ఇచ్చిన గంటల వ్యవధిలోనే తనలోతాను కుమిలిపోయి ఓ పీజీ వైద్య విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన వరంగల్ నగరంలో కలకలం రేపింది. అదీ ఆస్పత్రిలో డ్యూటీగా ఉండగా జరగడంతో కలకలం సృష్టించింది. జనగామ జిల్లా కొడకండ్ల మండలం మొండ్రాయి గిర్నితండాకు చెందిన ధరావత్ నరేందర్ వరంగల్‌లోని ఆర్‌పీఎఫ్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ కుటుంబం హైదరాబాద్‌లో సెటిల్ అయ్యింది. ఆయనకు ముగ్గురు కుమార్తెలు ఉండగా.. చిన్న కుమార్తె అయిన ప్రీతి(26) ఎంబీబీఎస్ పూర్తి చేసుకుని కేఎంసీలో అనస్థీషియా పీజీ కోర్సులో 2022లో చేరింది. ప్రస్తుతం థియరిటికల్ క్లాసులు జరుగుతున్నాయి.

ఇక్కడే వేధింపులు
అనస్థీషియా వైద్య విభాగ డ్యూటీ చార్టులో భాగంగా ఎంజీఎం ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్(ఈఓటీ)లో రోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్, ఒక ఎస్‌ఆర్, ఒక సీనియర్ పీజీ, ఇద్దరు జూనియర్ పీజీ విద్యార్థులు విధులు నిర్వర్తిస్తుంటారు. కొన్ని రోజులుగా ఇక్కడే విధులు నిర్వర్తిస్తోంది. ఇక్కడ పరిచయమైన సీనియర్ సైఫ్ కొంతకాలంగా వేధిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ప్రిన్సిపాల్ మోహన్‌దాసు ఆదేశాల మేరకు అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ నాగార్జునరెడ్డి మంగళవారం సాయంత్రం సైఫ్, ప్రీతిలను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇది జరిగిన గంటల వ్యవధిలోనే ప్రీతి ఆత్మహత్యకు యత్నించడంతో ఆమెకు వేధింపులు ఏ స్థాయిలో ఉన్నాయనే అనుమానం కలుగుతోంది.

ట్రెమడాల్ ఇంజక్షన్ ఎప్పుడు వాడుతారంటే..
ట్రెమడాల్ హైడ్రోక్లోరైడ్ 50 ఎంజీ ఇంజక్షన్ కీళ్లు, కండరాలను ప్రభావితం చేసే పరిస్థితుల్లో మితమైన, తీవ్రమైన నొప్పి నుంచి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది,. మనకు నొప్పి ఉందని చెప్పే మెదడులోని రసాయన దూతలను నిరోధించడం ద్వారా ఇది పనిచేస్తుంది. ఇది రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఆస్టియో ఆర్థరైటిస్ వంటి పరిస్థితుల్లో నొప్పిని తగ్గించడంలో సహాయపడుతుంది. చికిత్స పొందుతున్న పరిస్థితినిబట్టి మోతాదు, వ్యవధిని డాక్టర్ నిర్ణయిస్తారని వైద్యులు పేర్కొంటున్నారు.

మానసిక ఒత్తిళ్లకు తలొగ్గే వ్యక్తి కాదు..
విద్యలో ఎదురయ్యే ఎలాంటి మానసిక ఒత్తిళ్లకు తలొగ్గే విద్యార్థిని ప్రీతి కాదని బంధుమిత్రులు పేర్కొంటున్నారు. కరోనా సమయంలోనూ సికింద్రాబాద్ రైల్వే ఆస్పత్రిలో ఉద్యోగులకు సేవలందించిందని తెలిపారు. ప్రీతి తండ్రి రైల్వే విభాగంలో చేస్తున్న క్రమంలో తన తండ్రితో విధులు నిర్వర్తిస్తున్న వారి ఆరోగ్య సంరక్షణకు సికింద్రాబాద్ రైల్వే ఆస్పత్రిలో విస్తృత సేవలందించిందని రైల్వే అధికారులు తెలిపారు.



ప్రీతిని హైదరాబాద్‌కు తరలిస్తున్న వైద్యులు



రోదిస్తున్న ప్రీతి తల్లి, సోదరి, బంధువులు

ప్రీతి ఏ ఇంజక్షన్ వేసుకుంది..?
ప్రీతి ఏ ఇంజక్షన్ వేసుకుని ఆత్మహత్యకు యత్నించిందో ఎవరూ అధికారికంగా ధ్రువీకరించడం లేదు. ప్రీతి అనస్థీషియా ఇంజక్షన్ల సమాచారం కోసం తన సెల్‌ఫోన్‌లో తీవ్రంగా సెర్చ్ చేసినట్లు సమాచారం. ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్న ఆమె తీవ్రమైన నొప్పులతో బాధపడుతున్న సందర్భంలో తీసుకునే ట్రెమడాల్ ఇంజక్షన్ తీసుకున్నట్లు కొందరు వైద్యులు పేర్కొంటున్నారు. కానీ.. ప్రీతి ట్రెమడాల్ ఇంజక్షన్ కాకుండా అనస్థీషియా తీసుకోవడం వల్ల కార్డియాక్ అరెస్టుతోపాటు తన శరీరంలో పలు అవయవాలు పనిచేయకుండా పోయాయని మరికొందరు వైద్యులు చర్చించుకుంటున్నారు. ఆరు నెలల క్రితం ఎంజీఎం ఆస్పత్రిలో అనస్థీషియా ఇంజక్షన్ వికటించిన సందర్భంలో సైతం ఇద్దరు రోగులు కార్డియాక్ అరెస్టు కావడం వల్ల చనిపోయిన సందర్భాలను గుర్తుచేసుకుంటున్నారు.

మంత్రుల ఆరా..
ప్రీతి ఘటనపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు స్పందించారు. కేఎంసీ ప్రిన్సిపాల్ మోహన్‌దాసు, ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేధింపులు అయితే విచారణ కేసు పక్కదారి పట్టకుండా చూడాలని ఆదేశించారు. ఈ ఘటనపై రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కూడా స్పందించారు. సీపీ రంగనాథ్‌తో మాట్లాడి విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్న విద్యార్థినికి మెరుగైన వైద్యసేవలందించాలని వైద్యులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

కొన్ని రోజుల నుంచి ఓ అబ్బాయి వేధిస్తున్నాడు..



కొద్ది రోజుల నుంచి ఓ అబ్బాయి వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ విషయాన్ని తన సోదరికి, కుటుంబ సభ్యులకు చెప్పింది. మాట్లాడుదామని భరోసా ఇచ్చాం. ఉదయం ప్రీతి ఆత్మహత్యకు యత్నించిందని మాకు చెప్పారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు.
- దేవేందర్, ప్రీతి మేనమామ

తల్లిదండ్రులు ఏమంటున్నారంటే..



కాలేజీ, ఆస్పత్రిలో ర్యాగింగ్, వేధిస్తున్న సీనియర్ విద్యార్థి సైఫ్‌పై ప్రిన్స్‌పాల్‌కు ఫిర్యాదు చేస్తా అంటే వద్దు డాడీ అంటూ నివారించిందని తండ్రి తెలిపారు. ఈనెల 20న ఏడుస్తూ కాల్ చేసిందని, పీజీ సీనియర్ డాక్టర్ అరాచకంపై ఏసీపీ కిషన్‌కు చెప్పినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేయడంతో తనపై ఫిర్యాదు చేస్తావంటూ మరోసారి సైఫ్ ప్రీతిని బెదిరించగా మనస్తాపానికి లోనై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని చెప్పాడు.

ఎంజీఎం సూపరింటెండెంట్ ఏమన్నారంటే..



ఈ ఘటనపై ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్ విలేకరుల సమావేశంలో పలు అంశాలు వివరించారు. ఆపరేషన్ థియేటర్‌లో ప్రీతి కాకుండా విధుల్లో ఉన్న మరో అమ్మాయి, అబ్బాయితో మాట్లాడితే ఇంజక్షన్ ఏమీ తీసుకోలేదన్నారని తెలిపారు. ఆమెను పరిశీలిస్తే కార్డియాక్ అరెస్టు రావడంతో వైద్య బృందంతో సీపీఆర్(కార్డియో పులుమోనరీ రెసిటేషన్) ద్వారా చికిత్స చేసి ట్రీట్‌మెంట్ అందించామని చెప్పారు. గుండెకు సంబంధించి 28 శాతం ఏజెక్షన్ ఫ్రాక్షన్ ఒఫ్ హార్ట్, గ్లోబల్ హిపోకైనెషియా, పాంక్రియాటైటిస్, అసైటిస్, ఊపిరితిత్తుల సమస్య ఉన్నట్టు తేలిందన్నారు. ప్రీతికి థైరాయిడ్ సమస్య, కీళ్లవాతానికి సంబంధించి మందులు వాడుతున్నట్టుగా తేలిందని చంద్రశేఖర్ తెలిపారు.

ర్యాగింగ్ రోగం..
- కేఎంసీలో సీనియర్ల పైశాచిక చర్యలు
- పీజీ వైద్య విద్యార్థినికి తప్పని వేధింపులు
-10లో▸

కమిషనర్ స్థాయి అధికారితో విచారణ చేపట్టాలి : సురేఖ -8లో▸

నేడు భూపాలపల్లికి మంత్రి కేటీఆర్

- మంత్రులు సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి, జగదీశ్‌రెడ్డి రాక
- పలు అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపనలు



భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నేడు(గురువారం) రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి, బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటించనున్నారు. ఆయనపాటు మంత్రులు సత్యవతిరాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి రానున్నారు. జిల్లాకేంద్రంతోపాటు గణపురం మండలంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించి కొన్నింటికి శంకుస్థాపన చేయనున్నారు.

మంత్రి కేటీఆర్ షెడ్యూల్ ఇలా..
మంత్రి కేటీఆర్ హెలికాప్టర్‌లో గురువారం ఉదయం 10:30 గంటలకు గణపురం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించి, 11 గంటలకు గాంధీనగర్‌కు చేరుకొని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల ఆశ్రమ పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తారు. 11.45 గంటలకు మంజూర్‌నగర్‌కు చేరుకొని రూ.210కోట్లతో సింగరేణి కార్మికుల సౌకర్యార్థం సంస్థ నిర్మించిన 994 క్వార్టర్లను ప్రారంభిస్తారు. 12.15 గంటలకు రూ.3కోట్లతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వెనుక నిర్మించిన ఆర్ అండ్‌బీ అతిథి గృహం, మధ్యాహ్నం ఒంటిగంటకు రూ.23లక్షల నిధులతో నిర్మించిన దివ్యాంగుల కమ్యూనిటీ భవనం ప్రారంభిస్తారు. 1.15 గంటలకు భాస్కరగడ్డలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను ప్రారంభించి, 1.45 గంటలకు రూ.4.5కోట్లతో పట్టణంలోని సుభాష్‌కాలనీలో నిర్మించనున్న మినీ స్టేడియం పనులు ప్రారంభిస్తారు. అక్కడే రూ.14.59లక్షలతో నిర్మించిన స్ట్రీట్ వెండర్ దుకాణ సముదాయంతోపాటు కూరగాయల మార్కెట్ సముదాయం ప్రారంభించనున్నారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు సింగరేణి స్థలంలో జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్న భోజనం చేసిన అనంతరం 2.45 గంటలకు జిల్లాకేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ పాల్గొని ప్రసంగిస్తారు. 5.30 గంటలకు హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు వెళ్తారు.

పలకరిస్తూ.. సమస్యలు వింటూ..



పాదయాత్రలో మహిళలతో ముచ్చటిస్తున్న రేవంత్



మొగుళ్లపల్లి సభలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

భూపాలపల్లి జిల్లాలో సాగిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర

- పాదయాత్రలో పాల్గొనేందుకు తరలొచ్చిన జనం
- సర్కారు వైఫల్యాలను ఎండగట్టిన టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి
- ఓరుగల్లు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సామంత రాజులంటూ చురక

భూపాలపల్లి/చిట్యాల/మొగుళ్లపల్లి: పల్లెల్లో కనిపించిన ప్రతి ఒక్కరినీ పలకరించారు..వారు ఎదుర్కొంటున్న సమస్యలను వింటూ.. చేయి చేయి కలుపుతూ.. మేమున్నామనే భరోసా కల్పిస్తూ టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి హాథ్ సే హాథ్ జోడో యాత్ర కొనసాగించారు. నాయకులు, కార్యకర్తలు,ప్రజలు ఆయనతో పాదయాత్ర చేస్తూ జోష్‌గా కనిపించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో బుధవారం కొనసాగిన యాత్రలో.. బీఆర్‌ఎస్ పాలకులు రాష్ట్రంపై పడి దోచుకుంటున్నారని రేవంత్‌రెడ్డి దుమ్మెత్తిపోశారు. ఓరుగల్లు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సామంత రాజుల్లా వ్యవహరిస్తున్నారనిచురకలంటించారు.

కొడవటంచ ఆలయంలో పూజలు..
మంగళవారం రాత్రి 9.30 గంటలకు భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని వెంకట్రావ్‌పల్లి (సీ)కి చేరుకున్న రేవంత్‌రెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం ఆయన రాత్రి బస చేశారు. ఉదయం 9.25 గంటలకు రేగొండ మండలం కొడవటంచ శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవాలయానికి చేరుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

చీడ, పీడ విరగడ కావాలనే యాత్ర..
కొడవటంచ ఆలయం నుంచి బయటకు వచ్చిన రేవంత్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. భూపాలపల్లికి పట్టిన చీడ, పీడ విరగడం కోసమే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో యాత్రను ఇక్కడ చేపట్టామన్నారు. కొన్ని అరాచక శక్తులు ఆస్తుల కోసమే పార్టీ ఫిరాయించాయని అన్నారు. నక్సలైట్లు ఎర్రజెండాలు పాతి పేదలకు అందించిన భూములను స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తక్కువ ధరకు కొనుగోలు చేసి పరిశ్రమల పేరిట పామాయిల్ పంట సాగు చేస్తున్నాడని ఆరోపించారు. దీనిపై మంత్రి కేటీఆర్ విచారణకు ఆదేశించేందుకు సిద్ధంగా ఉన్నాడా.. అని ప్రశ్నించారు. నిన్న వీధి కుక్కలు ఒక పసి బాలుడిని పీక్కు తిన్నాయంటే మున్సిపల్ శాఖ మంత్రి ఎంతటి పనిమంతుడో సమాజానికి అర్థమైందని రేవంత్‌రెడ్డి అన్నారు.

అభివాదం చేస్తూ.. ముచ్చటిస్తూ..
రేవంత్‌రెడ్డి కొడవటంచ నుంచి కారులో చిట్యాల మండలం చల్లగరిగె, జూకల్ గ్రామాల మీదుగా తిరుమలాపూర్‌కు చేరుకున్నారు. ఆయా గ్రామాల ప్రధాన రహదారిపై పాదయాత్ర నిర్వహిస్తూ గ్రామస్తులకు అభివాదం చేశారు. పలువురిని పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రేవంత్‌రెడ్డి రాక సందర్భంగా మంగళ హారతులు, డప్పుచప్పుళ్లతో ప్రజలు ఘన స్వాగతం పలికారు. తిరుమలాపూర్ గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధులతో ముచ్చటించారు. అనంతరం ఓ వృద్ధురాలిని పలకరించి.. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ ఎలా ఉందమ్మా అని అడుగగా.. బాగానే ఉందని బదులిచ్చింది. తిరుమలాపూర్ నుంచి పాదయాత్ర చేసుకుంటూ చిట్యాలకు చేరుకుంటుండగా మార్గమధ్యలో ఓ కిరాణా షాపు వద్ద కూర్చొని ఉన్న మహిళలతో కాసేపు ముచ్చటించారు. మధ్యాహ్నం ఒంటిగంటకు చిట్యాలలోని తన శిబిరం వద్దకు చేరుకున్నారు. శిబిరంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించి సుమారు గంటపాటు ముచ్చటించారు. ఆయా కార్యక్రమాల్లో ములుగు ఎమ్మెల్యే సీతక్క, రాష్ట్ర, జిల్లా నాయకులు గండ్ర సత్యనారాయణరావు, మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, సిరిసిల్ల రాజయ్య, దొమ్మాటి సాంబయ్య, ప్రకాశ్‌రెడ్డి, కర్నాకర్, గూట్ల తిరుపతి, మధువంశీకృష్ణ, దబ్బెట రమేశ్, కృష్ణయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై సమగ్ర విచారణ

- కలెక్టర్ బి.గోపి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ గోపి, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ

వరంగల్ రూరల్: ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనుల్లో సామాజిక తనిఖీల్లో తేలిన లెక్కల వ్యత్యాసంపై సమగ్ర విచారణ చేపడతామని కలెక్టర్ బి.గోపి అన్నారు. అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి సోషల్ ఆడిట్ తేడాలు.. సమగ్ర విచారణపై పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, డీఆర్‌డీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుల్తానియా మాట్లాడుతూ సామాజిక తనిఖీల్లో చూపిన అవకతవకలు, లోపాలకు సంబంధించి మౌఖిక ఆదేశాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తప్పులు చేసిన వారిపై చర్యలు తీసుకున్న తర్వాత మాత్రమే డ్రాఫ్ట్ చేయాలని ఆయన చెప్పారు. కలెక్టర్ గోపి మాట్లాడుతూ ఇప్పటివరకు నిర్వహించిన సోషల్ ఆడిట్ వ్యత్యాసాలపై సమగ్ర విచారణ జరిపిస్తామన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి పథకంలో పనులు కల్పిస్తామన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ, డీఆర్‌డీఓ సంపత్‌రావు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు టీఎన్‌జీఓల సన్మానం



అదనపు కలెక్టర్ శ్రీవత్సను సన్మానించిన టీఎన్‌జీఓస్ నాయకులు

వరంగల్ రూరల్: కన్‌ఫర్డు ఐఏఎస్ అర్హత సాధించిన అదనపు కలెక్టర్ శ్రీవత్స కోటను టీఎన్‌జీఓస్ జిల్లా అధ్యక్షుడు గజ్జల రాంకిషన్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాంకిషన్ మాట్లాడుతూ ప్రజలకు చేసిన సేవ, గుర్తింపుగా ప్రభుత్వం ఐఏఎస్ హోదా కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి గాజె వేణుగోపాల్, కోశాధికారి పాలకుర్తి సదానందం, ఉపాధ్యక్షులు జగదీశ్వర్, మురళీధర్‌రెడ్డి, గద్దల రాజు, రామకృష్ణ, ఇంద్రసేనారెడ్డి, జిల్లా నాయకులు నాగేశ్వర్‌రావు, బుచ్చయ్య, కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్, విద్యా శాఖ ఫోరం అధ్యక్షుడు ఎస్.బి.శ్రీనివాస్, నాగరాజు, కుమార క్రాంతి, ఏంజెల్, ఎంజీఎం ఆస్పత్రి యూనిట్ కార్యదర్శి రవీందర్, భానుప్రకాష్, కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాపంథా' మార్గంలో పయనించాలి

నర్సంపేట: నూతన ప్రజాతంత్ర విప్లవం కోసం ప్రజాపంథా మార్గంలో పయనించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చంద్రన్న పిలుపునిచ్చారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలో బుధవారం ఆ పార్టీ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం మతోన్మాద సంస్థలను పెంచి పోషించడం వల్ల నే దేశంలో హిందూ మతోన్మాద ఫాసిజం పెచ్చరిల్లిపోతుందన్నారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చిర్ర సూరి, మాడ అశోక్, అడ్డూరి రాజు, అలువాల నరేశ్, కోడెం సారంగం, రమేశ్, కొమురయ్య, మనోహరాచారి, రాజేందర్, జవహర్‌లాల్, వీరారెడ్డి, ఎల్లన్న, నర్సింహస్వామి, లింగన్న, మల్లేశ్ పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా పాలకుర్తి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి

వరంగల్(పర్వతగిరి): ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా పాలకుర్తిని తీర్చిదిద్దుతున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. కల్లెడలోని ఆర్‌డీఎఫ్ పాఠశాలను బుధవారం సందర్శించిన ఆయన విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. పాలకుర్తిలో జరుగుతున్న అభివృద్ధిని విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాసరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అక్షరాభ్యాసం కూడా బమ్మెరలో జరిగే విధంగా నిర్మాణాలు చేపట్టామన్నారు. ప్రముఖ కవులు, పోరాట యోధులు, దేవాలయాలు, పుణ్యక్షేత్రాలు ఉన్న ప్రాంతంగా పాలకుర్తిని గుర్తించామన్నారు. ఈ ప్రాంతాన్ని ప్రతీ ఒక్కరు దర్శించుకోవాలని తెలిపారు. పర్వతగిరిలో ఇటీవల పురాతన శివాలయాన్ని పునరుద్ధరించామని, ఇందులో పాఠశాల విద్యార్థులు వలంటీర్లుగా అందించిన సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధి పనుల్లో జాప్యం చేయొద్దు'

నెక్కొండ: మన ఊరు–మన బడి కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో జాప్యం చేయొద్దని జిల్లా ప్లానింగ్ సెక్టోరియల్ అధికారి ఓడపల్లి సుధీర్‌బాబు అన్నారు. నెక్కొండలోని ప్రాథమిక, జెడ్పీ ఉన్నత పాఠశాలలతోపాటు పలు పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. మన ఊరు–మన బడి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఏబీఏఎస్ బయోమెట్రిక్ అటెండెన్స్, తొలిమెట్టు కార్యక్రమాల పనితీరును పరిశీలించారు. ప్రతీ ఉపాధ్యాయుడు లెస్సన్ ప్లాన్ ఆధారంగా తగిన సోపానాలను ఉపయోగిస్తూ విద్యార్థులకు బోధన చేయాలన్నారు. విద్యార్థుల్లోని సామర్థ్యాలను స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ వి.రత్నమాల, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్పీలు దేవేందర్, రమేశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా


దరఖాస్తుల ఆహ్వానం

కాశిబుగ్గ: వివిధ రంగాల్లో కృషి చేస్తున్న వ్యక్తులకు తెలుగు వెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సేవా సంస్థ అందించే 'తెలుగు వెలుగు ఉగాది మహానంది' పురస్కారాల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు వలబోజు మోహన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ పురస్కారాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలతో పాటు తమిళనాడు రాష్ట్రాలు వారు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులకు ఈ నెల 28 చివరి తేదీ అని వివరించారు. మరిన్ని వివరాలకు 9573417016, 9100174351 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

కాజీపేట: కాజీపేట పట్టణంలో ఈ నెల 17న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు అజయ్ (19) బుధవారం పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన తుసం భరద్వాజ్ (20), లోకేష్ (21), అజయ్ (19)లు నగరంలోని ఓ మిత్రుడి పుట్టిన రోజు వేడుకలకు హాజరై తిరిగి వస్తుండగా లారీ ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఘటన స్థలంలోనే భరద్వాజ్, లోకేష్‌లు మృతి చెందారు. ఆరు రోజులుగా అజయ్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

సమ్మక్క సాగర్‌లో నీటి నిల్వ



నీటితో కళకళలాడుతున్న సమ్మక్కసాగర్

కన్నాయిగూడెం: సమ్మక్క సాగర్ బ్యారేజీ 59 గేట్లను మూసివేసి నీటిని నిల్వ చేస్తున్నారు. దీనితో సమ్మక్క సాగర్ బ్యారేజీ నీటితో నిండు కుండను తలపిస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి బ్యారేజీలోకి 460 క్యూసెక్‌ల నీరు వచ్చి చేరడంతో బుధవారం బ్యారేజీ వద్ద 79.2 మీటర్ల నీటిమట్టం ఉంది. అదే విధంగా తుపాకులగూడెం వద్ద గోదావరిపై నిర్మించిన దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు వద్ద వివిధ పేజుల్లో 10 మోటార్లు ఉన్నాయి. ఇందులో పేజ్ 2లో ఒకటి, 3వ పేజ్‌లో 4మోటార్లను ఆన్ చేసి పంపింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం పేజ్ 2లో ఆన్‌చేసి ఉన్న మోటార్‌ను ఆఫ్ చేశారు. దీంతో పేజ్ 3లో నాలుగు మోటార్ల ద్వారా 1167క్యూసెక్‌ల నీరు మాత్రమే పంపింగ్ చేశారు.

అందరి కృషితోనే నిరంతర విద్యుత్



మాట్లాడుతున్న సీఎండీ గోపాల్‌రావు, వేదికపై చైర్మన్ ఇతర డైరెక్టర్లు



హాజరైన అధికారులు, ప్రతినిధులు

- ఎన్పీడీసీఎల్ పరిధిలో 64.28 లక్షల కనెక్షన్లు
- పంపిణీ నష్టాన్ని 14.89 నుంచి 10.80 శాతానికి తగ్గించాం
- ఏసీడీ పూర్తిగా వినియోగదారుడి సర్వీసుకే కలుపుతాం
- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు

హన్మకొండ అర్బన్: రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్, మంత్రి జగదీశ్వర్‌రెడ్డి, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావుల సహకారం, అందరి కృషితోనే రాష్ట్రంలో 24 గంటల నిరంతర విద్యుత్‌ను సరఫరా చేయగలుగుతున్నామని ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో టీఎస్ఎన్పీడీసీఎల్ 2023–2024 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన వార్షిక ఆదాయ ఆవశ్యకత, రిటైల్ సరఫరా ధరలు, క్రాస్–సబ్సిడీ సర్ చార్జీలు, విద్యుత్ కొనుగోళ్ల ట్రూ ఆప్ చార్జీలు, ఆర్థిక సంవత్సరం 2016–2017 నుంచి 2021–2023పై బహిరంగ విచారణ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ గోపాల్‌రావు 2023–2024 సంవత్సరం రిటైల్ సప్లై వ్యాపారానికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్పీడీసీఎల్ పరిధిలో సగటు వినియోగం 1210 యూనిట్లు ఉందని, ఇందులో వినియోగదారులు 64.68 లక్షలు, వ్యవసాయ సర్వీసులు 12,77,168, ఎల్‌టీ సర్వీసులు 55,87,517, హెచ్‌టీ సర్వీసులు 3,585 కాగా మొత్తంగా 64,68,270 సర్వీసులు ఉన్నాయని తెలిపారు. అలాగే నెట్ వర్క్‌కు సంబంధించి 2023 జనవరి నాటికి 400 కేవీ సబ్ స్టేషన్లు 1,479, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు 2,406, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు 3,16,233 ఉన్నాయని వివరించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలో మొత్తం 32 పట్టణాలు, 5,827 గ్రామాలు, 10,046 శివారు గ్రామాలు, 8,732 దళిత వాడలు, 4,506 బలహీన వర్గాల కాలనీలను విద్యుద్దీకరించామని తెలిపారు. మీటర్డ్ సేల్స్ 5 సంవత్సరాలకు సంచిత సగటు వృద్ధి రేటు 8.99 శాతంగా ఉందని తెలిపారు. అదే విధంగా విద్యుత్ కొనుగోలు కూడా పెరిగిందన్నారు.

అభ్యంతరాలు.. సూచనలు

ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన భారతీయ కిసాన్ సంఘ్, తెలంగాణ రజక సంఘం, టీజీవీపీ, ఇతర రైతు సంఘాల నాయకులు పాల్గొని పలు సమస్యలపై ఈఆర్సీ చైర్మన్‌కు వినతులు అందజేశారు. నాయకులు రాము, శ్రీధర్, మురళీధర్, ఆశయ్య తదితరులు పలు అంశాలను లేవనెత్తారు.. పలు సూచనలు చేశారు.

ఏసీడీ వినియోగదారుడి బిల్లులోనే....

టీఎస్‌ఈఆర్సీ రెగ్యులేషన్ ప్రకారం అడిషనల్ కంజప్షన్ డిపాజిట్ సంవత్సరానికి ఒకసారి వినియోగదారుడు గత సంవత్సరంలో వాడుకున్న యూనిట్లకు సరాసరి నెలకు లెక్కించి 2 నెలల డిపాజిట్ ఏసీడీగా వినియోగదారుల బిల్లులలో చూపించడం జరుతుందన్నారు. ఇది పూర్తిగా వినియోగదారుడి డిపాజిట్ వారి సర్వీసుకు కలపబడుతుందని తెలిపారు. దీనికి ముందస్తుగా నోటీసు ఇవ్వాలన్నారు. అలాగే పంటలకు కరెంట్ ఫెన్సింగ్ వేయడం చట్టరీత్యా నేరమని దీనికి 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ బస్వారాజు సారయ్య సభకు హాజరై చైర్మన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బి.వెంకటేశ్వర్‌రావు, పి.గణపతి, సంధ్యారాణి, తిరుపతిరెడ్డి, సంస్థ పరిధిలోని అన్ని జిల్లాల ఎన్పీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

నష్టాలను తగ్గించగలిగాం..

ఈ మేరకు పంపిణీ నష్టాలను 14.89 నుంచి 10.80శాతానికి తగ్గించగలిగామని గోపాల్‌రావు వివరించారు. మౌలిక వసతులు సబ్‌స్టేషన్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు ఎప్పటికప్పుడు పెంచుతున్నామన్నారు. అలాగే మౌలిక వసతుల వ్యవస్థ అభివృద్ధికి బిల్లింగ్‌లో మానవ పొరపాట్లను నివారించుటకు 41,64,482 ఐఆర్‌డీఏ మీటర్లను అమర్చినట్లు తెలిపారు. ఓల్టేజీని మెరుగుపర్చడానికి, నష్టాలను తగ్గించడానికి 33/11 కేవీ సబ్ స్టేషన్లలో 2,254 ఎంవీఏఆర్ సామర్థ్యం గల 1385 -2/1 ఎంవీఏఆర్ కెపాసిటర్ బాక్స్‌లను అమర్చినట్లుగా తెలిపారు. బిల్లింగ్ సకాలంలో పూర్తి చేయడానికి బిల్లింగ్ వ్యవధిని 30 రోజులకు పరిమితం చేయడానికి ఆండ్రాయిడ్ ఆధారిత మొబైల్ బిల్లింగ్‌ను ప్రవేశపెట్టామని వివరించారు.

ఇంద్రజాలంలో జాతీయస్థాయి గుర్తింపు

- రాణిస్తున్న తండ్రీ కుమారుడు
- నేడు ప్రపంచ ఇంద్రజాల దినోత్సవం





ఇంద్రజాల ప్రదర్శన ఇస్తున్న వెంకటేశ్వర్లు, సాయికుమార్

దోర్నకల్: మండల పరిధిలోని రావిగూడెంకు చెందిన తండ్రీ, కుమారుడు జుజ్జూరు వెంకటేశ్వర్లు, సాయికుమార్ ఇంద్రజాల ప్రదర్శనలో రాణిస్తూ జాతీయస్థాయిలో గుర్తింపు పొందారు. వెంకటేశ్వర్లు ఆర్టీసీలో కండక్టర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొంది ఖమ్మంలో నివాసం ఉంటున్నారు. పాఠశాల స్థాయి నుంచే వెంకటేశ్వర్లు ఇంద్రజాలంపై మక్కువ పెంచుకుని క్రాంతికొర్, బీవీ పట్టాభిరాం, గౌతమ్ తదితరుల వద్ద ఇంద్రజాలం, కమలాకర్ రాజన్ వద్ద వెంట్రిలాఫిజమ్‌పై శిక్షణ పొందారు. తెలుగు రాష్ట్రాలతో పాటు పలు రాష్ట్రాల్లో ఇప్పటి వరకు రెండు వేలకు పైగా ఇంద్రజాల ప్రదర్శనలు ఇచ్చారు. తన ప్రదర్శనలతో ప్రేక్షకులను మంత్రముగ్దులను చేస్తూ వెంట్రిలాఫిజమ్(మాట్లాడే బొమ్మ)తో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తూ ఆకట్టుకున్నారు. మూఢనమ్మకాలు, సాంఘీక దురాచారాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రదర్శనలు నిర్వహిస్తూ ప్రముఖుల చే మన్ననలు పొందారు. తన ప్రతిభతో అనేక రాష్ట్ర, జాతీయ ప్రతిభా పురస్కారాలు అందుకున్న వెంకటేశ్వర్లు ఎంజీ బుక్ ఆఫ్ రికార్డు, విజ్డమ్ నేషనల్ అవార్డు, ఇండియన్ బ్రదర్‌వుడ్ ఆఫ్ మెజీషియన్ లాంటి జాతీయ పురస్కారాలు అందుకున్నారు.

తండ్రి బాటలో తనయుడు

తండ్రిని ఆదర్శంగా తీసుకున్న కుమారుడు సాయికుమార్ ఇంద్రజాల ప్రదర్శనలో విశేషంగా రాణిస్తున్నారు. తన ఇంద్రజాలంతో చూపరులను ఇట్టే ఆకట్టుకుంటున్నారు. ఎస్‌డీఎఫ్‌సీలో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న సాయికుమార్ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రదర్శనలు ఇస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో పలు అవార్డులు సైతం అందుకున్నారు.

ముగ్గురు మిలీషియా సభ్యుల లొంగుబాటు



లొంగిపోయిన మిలీషియా సభ్యులకు ప్రోత్సాహకం అందజేస్తున్న ఏఎస్పీ సంకీర్త్, ఎస్సై తిరుపతిరావు

ఏటూరునాగారం/వెంకటాపురం(కె): ముగ్గురు మావోయిస్టు మిలీషియా సభ్యులు లొంగిపోయినట్లు ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్ వెల్లడించారు. ఈ మేరకు లొంగిపోయిన వారి వివరాలను బుధవారం ఏఎస్పీ వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా ఊసూరు బ్లాక్‌కు చెందిన మాడవి అడమ జన, చైతన్య నాట్య మండలి వింగ్ కమాండర్‌గా కస్తూరిపాడు గ్రామంలో పనిచేస్తున్నాడని తెలిపారు. ఇలా 11సంవత్సరాలు మావోయిస్టు పార్టీకి సేవలందించాడని తెలిపారు. అదే బ్లాక్‌లోని పూజారి కంకేర్ గ్రామానికి చెందిన సుంకరి నారాయణ 2009లో బడే చొక్కారావు అలియాస్ దామోదర్ నాయకత్వంలో మిలీషియా సభ్యునిగా చేరి మందుపాతరలు నాటడం, మావోయిస్టుల బంద్ పిలుపులతో వాహనాల రాకపోకలను అడ్డుకునేందుకు చెట్లను నరికి రోడ్లపై వేయడం, పోలీసుల కదలికలను పార్టీకి చేరవేసేవాడని తెలిపారు. అదే గ్రామానికి చెందిన మరో సభ్యుడు సుంకరి సుధాకర్ 2020లో జంగిల్ కమిటీ సభ్యునిగా చేరి పార్టీ కోసం పనిచేస్తున్నాడని తెలిపారు. అనంతరం లొంగిపోయిన వారికి ప్రోత్సాహకం కింద నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం(కె) ఎస్సై తిరుపతిరావు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం

- బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ బుర్రా వెంకటేశం



మాట్లాడుతున్న బుర్రా వెంకటేశం

కరీమాబాద్: పేద ప్రజలకు సేవ చేయడంలో లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయమని తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం అన్నారు. వరంగల్ ఉర్సు గుట్ట నాని గార్డెన్‌లో బుధవారం లయన్స్ క్లబ్ ప్రాంతీయ మహాసభను రీజియన్ చైర్‌పర్సన్ డాక్టర్ బైరి లక్ష్మినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల ద్వారా ప్రతీ మనిషి సంతృప్తి చెందుతూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారని వివరించారు. జీవితంలో డబ్బు సంపాధించడమే ముఖ్యం కాదని తెలిపారు. మన చుట్టూ ఉన్న పేదలకు కనీస అవసరాలు తీర్చినప్పుడు కలిగే సంతృప్తి వెలకట్టలేనిదని తెలిపారు. లయన్స్ క్లబ్ ప్రపంచ వ్యాప్తంగా అనాథలు, వికలాంగులు, వితంతువులకు, క్యాన్సర్, షుగర్ వ్యాధిగ్రస్తులకు, అంధులకు ఎన్నో సేవలు అందిస్తుందని కొనియాడారు. డిస్ట్రిక్ గవర్నర్ కన్నా పరుశురాములు మాట్లాడుతూ పేదలకు సేవ చేయడమే లయన్స్ క్లబ్ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్ రెడ్డి, పోకల చందర్, లక్ష్మీనర్సింగరావు, పొట్లపల్లి శ్రీనివాసరావు, రాజిరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, వెంకట్ రెడ్డి, డాక్టర్ మోహన్‌రావు, చందర్‌రావు, డాక్టర్ తాళ్ల రవి, కోదండపాణి, సహేందర్, ప్రకాశం, అప్పరాజు, చంద్రమోహన్, నరహరి, రమణయ్య, వేణు మాధవరావు, అజిత్, డాక్టర్ చంద్రశేఖర్, సుధాకర్ రెడ్డి, హరికేన్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

'వందేభారత్'పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సిబ్బంది

కాశిబుగ్గ: ఇటీవల వందేభారత్ రైలుపై జరుగుతున్న రాళ్లదాడి, రైల్వే ట్రాక్ లు, గేట్ల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గీసుకొండ మండలం ధర్మారం గ్రామంలో ప్రజలకు బుధవారం వరంగల్ జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు అవగాహన కల్పించామని తెలిపారు. రైలు, రైల్వే ఆస్తులపై ఎలాంటి దాడులకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజు, సిబ్బంది భాస్కర్, నాగరాజు, గణేష్, ఆర్‌పీఎఫ్ సిబ్బంది చంద్రమౌళి, నగేషులు పాల్గొన్నారు.

భార్యపై కత్తితో దాడి



గాయాలపాలైన శంకరమ్మ

మహాముత్తారం: భార్యపై భర్త కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల పరిధిలోని వజినేపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన చంద్రగిరి బొందయ్యకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య శంకరమ్మ తన కుమారుడితో వజినపల్లిలో నివాసం ఉంటుంది. గత కొన్ని రోజుల క్రితం గొడవల విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు భార్యభర్తలను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించినట్లు సమాచారం. ఈ క్రమంలో బుధవారం భార్య శంకరమ్మపై ఇంటి వద్ద కత్తితో దాడిచేయడంతో ఆమె తీవ్రగాయాలపాలైంది. కుమారుడు నాగరాజు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో వారు భూపాలపల్లి వందపడకల ఆస్పత్రికి తరలించారు. కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్సై సుధాకర్ తెలిపారు.

అదనపు కట్నం వేధింపులు.. దాడి

హసన్‌పర్తి: అదనపు కట్నం తీసుకురావాలని..బీటెక్ మెమో విషయంలో భార్యాభర్తల మధ్య వివాదం తలెత్తింది. దీంతో ఆగ్రహానికి గురైన భర్త రాడుతో భార్యపై దాడిగి దిగాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హసన్‌పర్తికి చెందిన సరళకు అదే ప్రాంతానికి చెందిన గొరె ప్రణయ్‌తో 6నెలల క్రితం వివాహం జరిగింది. పెళ్లి సమయంలో కట్న కానుకలు ఇచ్చి ఘనంగా వివాహం జరిపారు. ప్రస్తుతం సరళ బీటెక్ చదువుతుండగా, ప్రణయ్ ఆటో నడుపుతున్నాడు. వీరి కాపురం కొంతకాలం సవ్యంగా సాగింది. అనంతరం ప్రణయ్ రూ.3లక్షలు అదనపు కట్నం తీసుకురావాలని వేధించడం..బీటెక్ మెమో విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో ఆగ్రహానికి గురైన ప్రణయ్ భార్యపై రాడ్‌తో దాడి చేశాడు. ఈ క్రమంలో సరళ తలపై బలమైన గాయాలయ్యాయి. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ రావుల నరేందర్ తెలిపారు.

పటిష్టతకు మారుపేరు భారతి సిమెంట్

- మార్కెట్లోకి ఆల్ట్రాఫస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్
- తాపీమేస్త్రీల సమావేశంలో భారతి సిమెంట్ టెక్నికల్ ఇంజనీర్ సాగర్‌రెడ్డి



తాపీమేస్త్రీలకు ప్రమాద బీమా పత్రాలను అందజేస్తున్న సాగర్‌రెడ్డి

ఖిలా వరంగల్: సిమెంట్ వ్యాపారంలో దేశంలోనే అగ్రభాగాన, పటిష్టతకు మారు పేరుగా నిలిచిన ఏకైక సంస్థగా భారతి సిమెంట్ ఆల్ట్రాఫస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను మార్కెట్లోకి విడుదల చేశామని సంస్థ టెక్నికల్ ఇంజనీర్ సాగర్‌రెడ్డి అన్నారు. వరంగల్ లేబర్‌కాలనీలో కనకదుర్గ ఐరన్, సిమెంట్ హార్డ్‌వేర్‌లో మార్కెటింగ్ ఆఫీసర్ శివప్రసాద్ అధ్యక్షతన బుధవారం తాపీమేస్త్రీల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పొలిస్తే భారతి ఆల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగంగా పూర్తవుతుందని తెలిపారు. ఆల్ట్రాఫస్ట్‌తో ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆల్ట్రా ఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని, స్లాబ్ కాంక్రెట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయ పడుతారని తెలియజేశారు. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి ఆల్ట్రాఫాస్ట్ బలం చాలా అధికంగా ఉంటుందని వివరించారు. అనంతరం తాపీమేస్త్రీలకు లక్ష రూపాయల ఉచిత ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. ఈ సమావేశంలో డీలర్స్ రాజు, శివ, తాపీమేస్త్రీలు పాల్గొన్నారు.

ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

హన్మకొండ: విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ టీఎస్ ఎన్పీడీసీఎల్ శాఖ కార్యదర్శి ఎల్లావుల రాము డిమాండ్ చేశారు. ఆర్టిజన్ ఉద్యోగల హక్కుల సాధనకు తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో హనుమకొండ నక్కలగుట్టలోని ఎస్ఈ కార్యాలయం ఎదుట ఆర్టిజన్‌లు బుధవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ఆర్టిజన్ ఉద్యోగులకు రావాల్సిన హక్కులు కల్పించకుండా ఎన్పీడీసీఎల్ యాజమాన్యం జాప్యం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టిజన్ ఉద్యోగులకు ఏప్రిల్ 2022 నుంచి వేతన సవరణ చేయాలని, పర్సనల్ పేను బేసిక్‌లో కలుపాలన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డు రూల్స్ వర్తింపజేయాలని కోరారు. సబ్ స్టేషన్లలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, మెడికల్ అన్‌ఫిట్ అయిన ఆర్టిజన్ల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, విద్యార్హతకు తగిన కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, వరంగల్ జిల్లా కార్యదర్శి ప్రసాద్, ఆర్టిజన్ ఉద్యోగులు రాంరెడ్డి చంద్రమౌళి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతి

వరంగల్: హనుమకొండ ములుగు రోడ్డు సమీపంలోని ఒమేగా హాస్పిటల్‌లో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా బుధవారం ఓ మహిళ మృతి చెందింది. బంధువుల కథనం ప్రకారం.. లింగంపల్లి హారిక(32) కొన్ని నెలల నుంచి ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. హైదరాబాద్ లోని ప్రైవేట్ ఆస్పత్రిలో ఆమె చికిత్స పొందింది. ఆస్పత్రిలో చికిత్సకు డబ్బులు ఎక్కువ కావడంతో బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి వరంగల్‌లోని ఒమేగా హాస్పిటల్‌లో మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో అడ్మిట్ అయ్యింది. ఆస్పత్రిలో సరైన చికిత్స అందకపోవడంతో పాటు వైద్యుల నిర్లక్ష్యం వల్ల హారిక సాయంత్రం మృతి చెందిందని ఆమె బంధువులు ఆరోపించారు.

అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలి

నయీంనగర్: గవర్నమెంట్ డీడీ తీయకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారిని అరికట్టాలని ఇసుక లారీల యజమానుల సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సభ్యులు శ్రీనివాస్ నాయుడు, రవి కిషోర్, చుంచు రాజులు మాట్లాడారు. తమ సంఘం బాధ్యులే రోజుకు లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ డీడీలు తీయకుండా ఇసుక దందాను చేస్తున్నారని ఆరోపించారు. టీఎస్ఎండీసీలో బ్లాక్ లిస్టులో ఉన్న వాహనాల్లో ఇసుక రవాణా జరుగుతోందన్నారు. ఈ అక్రమ ఇసుక రవాణాలో అన్ని డిపార్ట్‌మెంట్ల వారికి ముడుపులు ముడుతున్నాయని ఆరోపించారు. ఒక్కో లారీలో 50 టన్నుల వరకు ఇసుక రవాణా అవుతుందని తెలిపారు.

కమిషనర్ స్థాయి అధికారితో విచారణ చేపట్టాలి

- మాజీ మంత్రి కొండా సురేఖ

ఎంజీఎం : గిరిజన వైద్యవిద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై ఎంజీఎం పరిపాలనాధికారులు, స్థానిక పోలీసులతో కాకుండా కమిషనర్ స్థాయి అధికారితో విచారణ చేపట్టాలని మాజీ మంత్రి కొండా సురేఖ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పీజీ వైద్యవిద్యార్థినీ ఆత్మహత్యయత్నానికి పాల్పడిన విషయం తెలుసుకునేందుకు ఎంజీఎం ఆస్పత్రికి వచ్చారు. విద్యార్థినిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారనే విషయం తెలుసుకున్న అనంతరం సురేఖ విలేకర్లతో మాట్లాడారు. ఎంజీఎం ఆస్పత్రిలో మెరుగైన సేవలదిస్తున్నామని పేర్కొంటున్న ఈ ఘటనే ఉదాహరణ అన్నారు. ఎంజీఎం ఆస్పత్రిలో మెరుగైన సౌకర్యాలు లేకపోవడంతోనే హైదరాబాద్‌కు తరలించారని తెలిపారు. ప్రగాల్భాలు పలికే నాయకులు మాటల్లో కాకుండా చేతుల్లో చూపించి పేద ప్రజలకు మెరుగైనా సేవలందించాలని డిమాండ్ చేశారు.

కేఎంసీలో లైంగిక వేధింపులు అరికట్టాలి


కేఎంసీలో వైద్య విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడి ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిపై చర్యరీత్యా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సింగారపు బాబు డిమాండ్ చేశారు. ఎంజీఎంలో చికిత్స పొందుతున్న డాక్టర్ ధరావత్ ప్రీతిని మెరుగైన వైద్యం అందించడానికి హైదరాబాద్‌కు తరలించారని తెలి పారు. విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి కారకుడైన సహిఫ్ సోయల్‌ను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అరూరి కుమార్, సీఐటీయూ జిల్లా నాయకులు ఎండి మహబూబ్ పాషా, సుంకరపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులు హేయమైన చర్య

రామన్నపేట: పవిత్రమైన వైద్య వృత్తిలో సేవలందించే విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడటం హేయమైన చర్య అని కుసుమ సతీశ్ అన్నారు. కేఎంసీలో పీజీ వైద్య విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఎంజీఎంలో ఆమె చికిత్స పొందుతున్న సందర్భంగా ఆయన బుధవారం సందర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. విద్యార్థిని ఆత్మహత్యయత్నంపై కమిషనర్ స్థాయి అధికారితో విచారణ జరిపించి వెంటనే దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్య వృత్తిలో ఉంటూ ఇలాంటి అఘాయిత్యానికి పాల్పడటం బాధాకరమన్నారు. మహిళలకు ఏదైనా ఇబ్బందులు ఉంటే ఉన్నతాధికారులు, పోలీసులకు సమాచారం అందించి న్యాయం పొందాలన్నారు. కాని ఆవేశంలో ఇలా ప్రాణాలు తీసుకోవడానికి యత్నించవద్దని విజ్ఞప్తి చేశారు.

పీడిత ప్రజల పక్షపాతి శోభారాణి

- పడమరకోట అమర వీరుల స్తూపం వద్ద శోభారాణికి నివాళి
- ఐఎఫ్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ



శోభారాణికి నివాళులర్పిస్తున్న కృష్ణ

ఖిలా వరంగల్: పీడిత ప్రజల పక్షపాతిగా కాకతీయ యూనివర్శిటీ తెలుగు విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కందాల శోభారాణి నిలిచారని ఐఎఫ్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ అన్నారు. ఖిలా వరంగల్ పడమరకోటలో మానవ హక్కుల వేదిక నాయకులు బండి కోటేశ్వరరావు, ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్, రైతుకూలి సంఘం జిల్లా నాయకులు బాలరాజు ఆధ్వర్యంలో సంతాప సభ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై శోభారాణి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. శోభారాణి బాల్యం నుంచే హేతువాద దృక్పథాన్ని అలవర్చుకుని ప్రతీ విషయాన్ని ప్రశ్నించడంలో ముందు వరుసలో ఉండేవారన్నారు. శోభారాణి మన మధ్యలేకపోయిన ఆమె ఆశయాలను కొనసాగించడంలో సమష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సింగం, రాజు, విజయపాల్, జయ, కర్నాకర్, మోహన్, కృష్ణ, హరిబాబు, అక్బర్, కార్యకర్తలు పాల్గొన్నారు.